## అభివృద్ధి, సంక్షేమ పథకాలలో జనగణన కీలకం

మున్సిపల్ చైర్మన్ అగ్గనూరి బసవేశ్వర్



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** అభివృద్ధి..సంక్షేమ పథకాల అమలులో జనగణన కీలకమని మున్సిపల్ చైర్మన్ అగ్గనూరి బసవేశ్వర్ అప్ప వివరించారు. మంగళవారం మున్సిపల్ పరిధిలోని గాంధీనగర్ కాలనీలో చైర్మన్ తన కుటుంబ సభ్యుల వివరాలను నమోదు చేయించుకున్నారు. ఈ సందర్భంగా చైర్మెన్ బసవేశ్వర్ అప్ప మాట్లాడుతూ ప్రతి కుటుంబ సభ్యుడు విధిగా తమ వివరాలను నమోదు చేయించుకోవాలని, వచ్చే అధికారులకు సహకరించాలన్నారు. అధికారులు విధిగా ఇంటింటికి వెళ్ళి వివరాలను సేకరించాలని, కార్యక్రమంలో రెండవ వార్డు కౌన్సిలర్ బచ్చలి నరేష్, ఎన్యూమరేటర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## బిసిలను ఏకం చేసేందుకు కృషి



**ప్రజాపక్షం/ఫరూక్‌నగర్:** బిసి సేన తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా పసుపుల ప్రశాంత్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మంగళవారం షాద్‌నగర్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి సమావేశంలో పసుపుల ప్రశాంత్‌ను రాష్ట్ర అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ప్రశాంత్ మాట్లాడుతూ తెలంగాణలో బిసిలను ఏకం చేసి బీసి జనసేన బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో బిసి జనసేన నేతలు జక్కుల జలజ, కాటం భాగ్యలక్ష్మి గౌడ్, గడ్డమీది రమేష్, పసుపుల సత్యం, రాములు, వెంకటయ్య, సాయి తరుణ్, వసంత్‌లు పాల్గొన్నారు.


## ఉపాధి కూలీలకు తక్షణమే పెండింగ్ బిల్లులు చెల్లించాలి

వ్య.కా.స. రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు అంజయ్య



**ప్రజాపక్షం/యాచారం :** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఉపాధి కూలీలకు తక్షణమే పెండింగ్ బిల్లులు చెల్లించాలని వ్యకాస రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు పి. అంజయ్య డిమాండ్ చేశారు. మంగళవారం మండల పరిధిలోని కుర్మిద్ద గ్రామంలో ఉపాధి కూలీలతో మాట్లాడారు. ఈ సంధర్బంగా అయన మాట్లాడుతూ ఉపాధి కూలీలకు 12 వారాల పెండింగ్ రావాల్సి ఉందన్నారు. ఫొటో దింపే విధానం రద్దు చేసి పేస్లిపులు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎం.సురేశ్, గోవర్ధన్, మల్లయ్య, కూలీలు పాల్గొన్నారు.

## ఘనంగా హనుమాన్ జయంతి



**ప్రజాపక్షం/యాచారం :** మండల పరిధిలోని నందివనపర్తి గ్రామంలో హనుమాణ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రాయికంటి విజయ్‌కుమార్, ఉప సర్పంచ్ శ్రీశైలం,జ్ఞాన సరస్వతి సేవా సమితి సభ్యులు రాఘవేంద్ర శర్మ, రామనాథం,సంగెం గణేశ్,చిన్న జలంధర్‌రెడ్డి, నిఖిల్, శ్రీనివాస్‌రెడ్డి, గ్రామ నాయకులు నాగ రాజు, మహెంధర్,లక్ష్మ ణ్, సాయికుమార్,సురేశ్ శ్రీనాథ్ పాల్గొన్నారు.

## ఫార్మాసిటీ రైతుల సమస్యలు పరిష్కరించడానికి కృషి



**ప్రజాపక్షం/యాచారం :** ఫార్మాసిటీ రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి కృషి చేస్తానని ఎంఎల్‌సి ప్రొఫెసర్ కోదండ రామ్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ఫార్మాసిటీ భూ బాధిత గ్రామాలకు చెందిన రైతులు కోదండారామ్‌ను కలిసి వారి సమస్యలను వివరించారు. ఈ సంధర్బంగా అయన మాట్లాడుతూ ఫార్మాసిటికి బల వంతపు భూసేకరణ తక్షణమే నిలిపి వేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వంతో మాట్లాడి సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో టిజెఎస్ రంగారెడ్డి జిల్లా ప్రధానకార్యదర్శి సామ నిరంజన్ ఫార్మా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## సేంద్రియ వ్యవసాయంపై దృష్టి



**ప్రజాపక్షం/కొందుర్గు:** రైతులు సేంద్రియ వ్యవసాయంపై దృష్టి కేంద్రీకరించేందుకు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని జయశంకర్ వ్యవసాయ విశ్వ విద్యాలయం శాస్త్రవేత్తలు డాక్టర్ మల్లయ్య, డాక్టర్ చంద్ర మోహన్‌లు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో సేంద్రీయ వ్యవసాయం, ఆరుతడి పంటల సాగుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్ర వేత్తలు మాట్లాడుతూ వర్షపునీరు వృదా పోనివ్వకుండా కట్టలుగా పోసి పోలాల్లోనే నీరు ఇంకే విధంగా చూడాల్సిన బాధ్యత రైతులపై ఉందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ చౌదపునం ప్రభాకర్, పర్వతాపూర్ సర్పంచ్ అశోక్, వ్యవసాయ అధికారులు రాజేందర్‌రెడ్డి, వాసవి వెంకటేష్, లక్ష్మి కాంత్, వార్డు సభ్యులు శ్రీను పాల్గొన్నారు.

# ప్రాధాన్యత క్రమంలో సమస్యలు పరిష్కారం

సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సృజన

మూసాపేటలో ప్రజలతో ముఖాముఖి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రతిరోజు ఒక వార్డు కార్యక్రమంలో భాగంగా 11వ రోజున సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సిఎంసి) కమిషనర్ సృజన కూకట్‌పల్లి జోన్ పరిధిలోని మూసాపేట వార్డులో క్షేత్రస్థాయి తనిఖీ నిర్వహించారు. ఈ పర్యటనలో జోనల్ కమిషనర్, డెప్యూటీ కమిషనర్‌తో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ స్థానిక ప్రజలు, కాలనీ సంక్షేమ సంఘాల (ఆర్‌డబ్ల్యూఏలు) ప్రతినిధులతో సమావేశమై పౌర సదుపాయాలపై అభిప్రాయాలు తెలుసుకున్నారు. భరత్ నగర్ వద్ద ట్రాఫిక్ సిగ్నల్, నో యూటర్న్ ఆంక్షల కారణంగా కాలనీలకు వెళ్లే నివాసితులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు స్థానికులు వివరించారు. అలాగే రైల్వే పిల్లర్ల కింద ఉన్న హెచ్‌ఎంఆర్‌ఎల్ షాపులను తొలగిస్తే ట్రాఫిక్ రద్దీ తగ్గుతుందని సూచించారు. పి అండ్ టి కాలనీలో శిథిలావస్థకు చేరిన భవనాలు భద్రతకు ముప్పుగా మారడంతో పాటు అసాంఘిక కార్యకలాపాలకు కేంద్రాలవుతున్నాయని, వాటిని వెంటనే కూల్చివేయాలని నివాసితులు కోరారు. భరత్ నగర్ ఫ్లైఓవర్ సమీపంలో కార్లు, తోపుడు బండ్లు అక్రమంగా పార్కింగ్ చేయడం వల్ల రాకపోకలకు ఆటంకం కలుగుతోందని ఫిర్యాదు చేశారు. వీధి దీపాల టైమర్లు పనిచేయకపోవడం, ఫుట్ ఓవర్ బ్రిడ్జ్ వద్ద లిఫ్ట్ పనిచేయకపోవడం, లైటింగ్ అసంపూర్తిగా ఉండటం, నిర్వహణ లోపించడం వంటి సమస్యలను కూడా కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. పోచమ్మ దేవాలయం వద్ద మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ నిర్మించాలని, ప్రస్తుతం ఉన్న లైబ్రరీ భవనంపై మొదటి అంతస్తులో కమ్యూనిటీ హాల్ ఏర్పాటు చేయాలని స్థానికులు విజ్ఞప్తి చేశారు. ప్రాంత భద్రత కోసం సిసిటివి కెమెరాలు ఏర్పాటు చేయాలని కూడా కోరారు. ఈ సమస్యలపై స్పందించిన కమిషనర్ సంబంధిత శాఖల అధికారులకు తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సమస్యలను ప్రాధాన్యత క్రమంలో తీసుకుని, వివిధ విభాగాల సమన్వయంతో నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సూచించారు. ప్రజలతో నేరుగా మమేకమై క్షేత్రస్థాయి పరిస్థితులను అంచనా వేసి సమస్యలను వేగంగా పరిష్కరించడమే ప్రతిరోజు ఒక వార్డు కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని కమిషనర్ తెలిపారు.

## ప్రధాని నరేంద్ర మోదీ మాటలన్నీ అబద్ధాలే : వివిఎస్ బోస్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రధాని మోదీ మాటలన్నీ అబద్ధాలు, చర్యలన్నీ మోసపూరితమైనవేనని సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వి.ఎస్.బోస్ విమర్శించారు. ఇప్పటి వరకు లేని పెట్రోల్ సంక్షోభం ఇప్పుడే వచ్చినట్లు హైదరాబాద్ బహిరంగ సభలో ప్రజలు అధిక భారాన్ని భరించాలని చెప్పటం నీతిమాలిన చర్య అని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పెట్రోల్ ధరలు పెంచితే సహించేది లేదని, భవిష్యత్తులో ప్రజా తిరుగుబాటు తప్పదని బోస్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఐదు రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికల సందర్భంలో పెట్రోల్ రేట్ల పెంపుపై ఎలాంటి మాట మాట్లాడని మోదీ ఎన్నికలు ముగిసిన వెంటనే పెట్రోల్ రేట్లపై మర్మగర్భంగా చెప్పటం మోసపూరితమైందన్నారు. పెట్రోల్ సంక్షోభానికి అమెరికా అనుసరిస్తున్న విధానమే కారణమని ప్రపంచానికి తెలిసినప్పటికీ ట్రంప్‌కు వంత పాడుతున్న ప్రధాని మోదీకి సైతం ఇందులో సమానపాత్ర ఉన్నదనేది వాస్తవమన్నారు. అమెరికా సృష్టించిన ఉక్రెయిన్ యుద్ధ వాతావరణ సందర్భంలో రష్యాపై అమెరికా విధించిన ఆంక్షల వల్ల రష్యా భారత్ కారుచౌకగా క్రూడ్ ఆయిల్ సరఫరా చేస్తే దానిని మోదీ తన ప్రియమిత్రుడైన అదానీకి అప్పచెప్పడం ద్వారా వేల కోట్ల రూపాయలను దోచుకునేందుకు సహాయ పడ్డారని విమర్శించారు. ఇప్పుడు పెట్రోల్‌పై భారం పెరగటం ద్వారా ప్రభుత్వంపై పడిన అదనపు భారాన్ని రష్యా క్రూడ్‌ఆయిల్ ద్వారా ఆదానీ పొందిన లాభాల నుంచి ప్రభుత్వం రాబట్టుకునిలోటును సరిచేయాలని ఆయన కోరారు.

## యాదవ కార్పొరేషన్ చైర్మన్ రఘునాథ్‌కు సన్మానం



**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగక్:** యాదవ కార్పోరేషన్ చైర్మన్‌గా ఎన్నికైన రఘునాథ్ యాదవ్‌ను యాదవ సంఘం రాష్ట్ర కార్యదర్శి దామోదర్ యాదవ్ సన్మానించారు. మంగళవారం రఘునాథ్ యాదవ్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకొని శాలువాలతో సన్మానించారు. ఈసందర్భంగా దామోదర్ యాదవ్ మాట్లాడుతూ యాదవ సామాజిక వర్గాన్ని ఆర్థికంగా, సామాజికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా కార్పోరేషన్‌నుముందుకు నడిపించగల నాయకుడు రఘునాథ్ యాదవ్‌అని ప్రశంసించారు. కార్యక్రమంలో అంజన్ యాదవ్, చెన్న కేశవులు యాదవ్, కపిల్ యాదవ్, శివ యాదవ్, రఘు యాదవ్, ఆనంద్ కుమార్ యాదవ్, సాయి యాదవ్, నర్సింగ్ యాదవ్ పాల్గొన్నారు.

# యువతకు మెరుగైన అవకాశాల కల్పన

ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్



**ప్రజాపక్షం / సిటీ బ్యూరో :** ప్రభుత్వం జాబ్‌మేళాల ద్వారా యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ తెలిపారు. బంజారా హిల్స్‌లోని బాబు జగ్జీవన్‌రామ్ భవన్‌లో మంగళవారం ప్రజాపాలన ప్రగతి నివేదిక 99రోజులు కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన జాబ్‌మేళాలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను ఉపయోగించుకోవాలన్నారు. ఈ మెగా జాబ్‌మేళా కార్యక్రమాన్ని ఈనెల 12వరకు జిల్లాల్లో ఒక్కొక్క రోజు చొప్పున నిర్వహించారన్నారు. జిల్లా యువజన క్రీడల శాఖ, పరిశ్రమల శాఖ, ఉపాధిశాఖ, సమాచార, సాంకేతిక శాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈమేళాకు యువత నుంచి భారీ స్పందన వచ్చింది. నిరుద్యోగులైన యువత ఈ జాబ్‌మేళా ద్వారా మెరుగైన అవకాశాలు పొందాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆల తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ శాఖల అధికారులు, యువత తదితరులు పాల్గొన్నారు.

# ఆస్కీలో కొత్త అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులు ప్రారంభం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఆస్కీలో నూతన అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులను ప్రారంభిస్తున్నట్లు కాలేజ్ డైరెక్టర్ డాక్టర్ జి.రామేశ్వర్ రావు తెలిపారు. కాలేజీలోని స్కూల్ ఆఫ్ పోస్ట్ గ్రాడ్యుయేట్ స్టడీస్‌ను పునర్వ్యవస్థీకరించి, స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ ఎక్సలెన్స్, స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ఎక్సలెన్స్‌గా విడదీసినట్లు వెల్లడించారు. స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ ఎక్సలెన్స్‌లో ఈ విద్యా సంవత్సరం నుంచి బీటెక్‌లో ఐదు ప్రత్యేక అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులను ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. ఇందులో బీటెక్ సిఎస్‌ఈ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్), రోబోటిక్స్ అండ్ ఏఐ, ఎలక్ట్రానిక్స్ అండ్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, సివిల్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్ వంటి కోర్సులు ఉండనున్నాయి. ఈ కోర్సులన్ని ఎఐసిటిఈ ఆమోదం పొందినవేనని తెలిపారు. జెఎన్‌టియుతో ఒప్పందం కుదిరిందని చెప్పారు. జెఎన్‌టియు వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ టి.కృష్ణా రెడ్డి, డైరెక్టర్ డాక్టర్ జి. రామేశ్వర్ రావు మధ్య సోమవారం ఒప్పంద పత్రాలపై సంతకాలు జరిగాయి. సమావేశంలో జెఎన్‌టియు రిజిస్ట్రార్ డాక్టర్ కె.వెంకటేశ్వర్ రావుతో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు. ఎస్కీ తరఫున ఎస్‌పిజిఎస్ అడ్వైజర్ ప్రొఫెసర్ వి.ఆర్.శాస్త్రీ తదితరులు హాజరయ్యారు. స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ఎక్సలెన్స్‌లో ఇప్పటికే కొనసాగుతున్న పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ జనరల్ మేనేజ్‌మెంట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మేనేజ్‌మెంట్ కోర్సులతో పాటు కొత్తగా బ్యాచిలర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ (బిబిఏ) కోర్సును కూడా ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. 202627 విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు ప్రారంభమైనట్లు వెల్లడించిన డాక్టర్ రామేశ్వర్ రావు, ఆధునిక విద్యావిధానానికి అనుగుణంగా రూపొందించిన ఈ కోర్సులు విద్యార్థుల భవిష్యత్తుకు మంచి అవకాశాలు కల్పిస్తాయన్నారు.

## చట్టం అందరికీ సమానం కాదా..?

సిపిఐ(ఎంఎల్) మాస్ లైన్

**ప్రజాపక్షం/ హైదరాబాద్ :** కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథపై మైనర్ బాలిక అత్యాచారానికి సంబంధించిన ఆరోపణల వ్యవహారంలో చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సిపిఐ(ఎంఎల్ )మాస్ లైన్ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఉన్నత కుటుంబాలకు ఒక చట్టం, సామాన్య ప్రజలకు మరో చట్టం అన్నట్లుగా వ్యవహరించకూడదని, పోక్సో కేసు నమోదు చేసి నిష్పక్షపాత విచారణ జరపాలని రాష్ట్ర కార్యదర్శి పోటు రంగా రావు మంగళవారం ఓ ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. కేంద్ర మంత్రిగా ఉన్న బండి సంజయ్ హోదాను ఆసరాగా చేసుకుని కేసును నీరుగార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయనే అనుమానాలు వ్యక్తం చేశారు. మైనర్ బాలికలపై అత్యాచారాన్ని పాల్పడినట్లు ఆరోపణలు వచ్చిన సందర్భంలో వెంటనే పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాల్సిందిపోయి, విచారణ పేరుతో కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. మహిళల భద్రత, చట్ట పరిరక్షణ విషయంలో ప్రభుత్వం ద్వంద్వ వైఖరి ప్రదర్శించకూడదని పేర్కొన్నారు. చట్టం అందరికీ సమానమనే సూత్రాన్ని అమలు చేయాలని, రాజకీయ ఒత్తిళ్లకు లోనుకాకుండా పోలీసులు స్వతంత్రంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు.

## కంపోస్టింగ్ విధానాలపై శిక్షణ



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** 99 రోజుల కార్యాచరణ ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్(ఎంఎంసి) పరిధిలో హరిత వ్యర్థాల సమర్థ నిర్వహణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా మంగళవారం యుబిడి డైరెక్టర్ సునందా ఆధ్వర్యంలో కంపోస్టింగ్ విధానాలపై రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్‌లకు అవగాహన, శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. మొత్తం 23 పార్కుల్లో నిర్వహించిన ఈ కార్యక్రమాల్లో అన్ని సర్కిళ్లకు చెందిన 200 మందికి పైగా రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు. ఇంటి వద్దే తడి చెత్తను వేరు చేసి కంపోస్టింగ్ చేయడం, పర్యావరణ పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచడం, పరిశుభ్రమైన కాలనీల నిర్మాణానికి తోడ్పడడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమన్నారు. ప్రతి కాలనీలో తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి కంపోస్టింగ్ విధానాలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని ఎంఎంసి కమిషనర్ వినయ్ క్రిష్ణా రెడ్డి అన్నారు. ప్రజలు స్వచ్ఛత కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని పరిశుభ్రమైన మల్కాజిగిరి నిర్మాణానికి సహకరించాలని ఆయన కోరారు.

## ప్రీ-ఎస్ఐఆర్ మ్యాపింగ్ కార్యకలాపాలపై సమీక్ష సమావేశం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్ ఆదేశాల మేరకు 58మలక్‌పేట్ అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన ప్రీ ఎస్ఐఆర్ మ్యాపింగ్ కార్యకలాపాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. అదనపు కమిషనర్ (ఎన్నికలు) చంద్రకళ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలు, బిఎల్‌ఓ సూపర్‌వైర్లు పాల్గొన్నారు. ఓటర్ల డేటా ఖచ్చితమైన ధృవీకరణ, బూత్ స్థాయి మ్యాపింగ్ సమర్థవంతంగా నిర్వహించడం, ప్రీఎస్ఐఆర్ కార్యక్రమాలను సకాలంలో పూర్తి చేయడం వంటి అంశాలపై చర్చించారు. క్షేత్రస్థాయి సమన్వయాన్ని బలోపేతం చేయాలని, బిఎల్‌ఓల పనితీరును నిశితంగా పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని చంద్రకళ స్పష్టం చేశారు.



## జి.ఆర్.నికితకు ప్రతిష్ఠాత్మక డాక్టరేట్

ఇంగ్లీష్ భాషా బోధనలో విశిష్ట పరిశోధనకు గుర్తింపు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఇంగ్లీష్ భాషా బోధనలో పరిశోధనాత్మక కృషికి గుర్తింపుగా జి.ఆర్. నికితకు డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ (పిహెచ్‌డి) పట్టా లభించింది. భారతీయ ఇంజినీరింగ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఇన్నోవేషన్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డా. కె.నాగజ్యోతి చేతుల మీదుగా ఆమె ప్రతిష్టాత్మక డాక్టరేట్ పట్టాను అందుకున్నారు. ఇంగ్లీష్ (ఇఎల్‌టి) విభాగంలో ఆమె సమర్పించిన తెలంగాణ రాష్ట్రంలోని ఎంపిక చేసిన జిల్లాల ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో టాస్క్‌బేస్డ్ అప్రోచ్ ద్వారా రచనా నైపుణ్యాల అభివృద్ధి అనే పరిశోధన విశేష ప్రాధాన్యతను సంతరించుకుంది. అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థుల రచనా నైపుణ్యాలను మెరుగుపరచడంలో టాస్క్‌బేస్డ్ అప్రోచ్ ప్రభావాన్ని ఈ అధ్యయనం విశ్లేషించింది. ఇంగ్లీష్ భాషా బోధనలో రచనా సామర్థ్యాలను పెంపొందించేందుకు ఉపయోగపడే పలు టాస్క్‌బేస్డ్ కార్యకలాపాలను ఈ పరిశోధనలో వివరించినట్లు తెలిపారు.

## గ్రామీణ ప్రాంతాల్లో వెలుగులు నింపడమే లక్ష్యం

ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి



**ప్రజాపక్షం/కేశంపేట:** గ్రామీణ ప్రాంతాల్లో వెలుగులు నింపేందుకే హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేశామని ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్ రెడ్డి వివరించారు. సోమవారం రాత్రి కేశంపేట మండల పరిధిలోని తూర్పుగడ్డ తండా, గుట్టలగడ్డ తండా, పోమాల్‌పల్లి, లింగంధాన గ్రామాల్లో ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి సొంత ఖర్చులతో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో వెలుగులు నింపాలన్నదే లక్ష్యంగా పనులు చేపట్టడం జరుగుతుందని వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు థౌర్యానాయక్, స్వప్న భూపాల్‌రెడ్డి, నాగిళ్ళ వెంకటేష్, ఏసిఎస్ చైర్మన్ జగదీశ్వర్ గౌడ్, కమ్మదనం సర్పంచ్ లతా కిరణ్ గౌడ్, ఇప్పలపల్లి సర్పంచ్ మంజుల జంగయ్య, పొల్కంగుట్ట తండా సర్పంచ్ భాస్కర్‌నాయక్, మాజీసర్పంచులు తాంద్ర విష్ణువర్ధన్‌రెడ్డి, శేఖర్ పంతులు, యారం శేఖర్‌రెడ్డి, ఆంజనేయులు యాదవ్ పాల్గొన్నారు.

# ఆధ్యాత్మిక కేంద్రంగా వేదగిరి ఆలయాన్ని తీర్చిదిద్దుతా

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** వేదగిరి ఆలయాన్ని గొప్ప ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటామని, ఇందుకు ప్రజలందరు సహకరించాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కోరారు. మంగళవారం వ్యవస్థాపకుడు మద్రి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో వేదగిరి కొండపై హనుమాన్ జయంతిని పురస్కరించుకొని గురు నిలయానికి భూమిపూజ చేయడంతోపాటు గిరి ప్రదక్షిణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రత్యేక అథితులుగా అంబాత్రేయ క్షేత్ర పీఠాధిపతులు ఆదిత్య పరాస్వామి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ ఆధ్యాత్మిక క్షేత్రాలు భక్తులను ప్రశాంత వాతావరణం వైపు నడిపించి జీవితంలో ఉన్నత స్థాయికి ఎదిగేలా ప్రోత్సహిస్తాయన్నారు. దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని, ప్రత్యేకంగా నిధులు సైతం మంజూరు చేస్తుందని వివరించారు. వేదగిరి క్షేత్రం దేదీప్యమానంగా వెలిగేలా తీర్చిదిద్దనున్నట్లు వ్యవస్థాపకుడు మద్రి కృష్ణారెడ్డి వివరించారు. కాంగ్రెస్ యువ నాయకుడు కేకే కృష్ణ భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.




### లబ్ధిదారులకు సిఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి వచ్చిన చెక్కులను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ లబ్ధిదారులకు పంపిణీ చేశారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నియోజకవర్గానికి మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అందజేశారు. ఫరూఖ్‌నగర్ మండలానికి 24, కొత్తూరు మండలానికి 14, కొందర్గు మండలానికి 10, కేశంపేట మండలానికి 14, నందిగామ మండలానికి నాలుగు, జిల్లేడు చౌదరిగూడ మండలానికి నాలుగు, షాద్‌నగర్ మున్సిపాలిటికి 13చొప్పున మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సర్పంచులు, ప్రజలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ పాలనలో ఉద్యమకారులకు దక్కని గుర్తింపు

- తెలంగాణ ఉద్యమంలో కెసిఆర్ కంటే ముందు నేనే ఉన్నా
- టిజెఎస్ ప్లీనరీలో ప్రొఫెసర్ కోదండరామ్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కెసిఆర్ కంటే ముందే తాను తెలంగాణ ఉద్యమంలో ఉన్నానని, తన తర్వాతే ఆయన ఉద్యమంలోకి వచ్చారని తెలంగాణ జన సమితి(టిజెఎస్) అధ్యక్షులు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ ఎం.కోదండరామ్ అన్నారు. బిఆర్ఎస్ పరిపాలనలో తెలంగాణ ఉద్యమకారులకు ఏమాత్రం గుర్తింపు దక్కలేదని విమర్శించారు. తెలంగాణ ఉద్యమకారులకు తగిన గుర్తింపు ఇచ్చి, వారికి బతుకుదెరువు చూపాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. తెలంగాణ వచ్చిన తర్వాత అప్పటి సిఎం కెసిఆర్ కేవలం కమీషన్‌ల కోసమే ప్రభుత్వాన్ని నడిపారని ఆయన ఆరోపించారు. టిజెఎస్ పార్టీ ప్లీనరీ సమావేశం హైదరాబాద్ ట్యాంక్‌బండ్ నెక్లెస్ రోడ్‌లోని జలవిహార్‌లో మంగళవారం జరిగింది. ప్లీనరీలో ప్రొఫెసర్ కోదండరామ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును నక్సలైట్లు కూడా కోరుకున్నారని, టిఆర్ఎస్ (ప్రస్తుత బిఆర్ఎస్) అధికారంలోకి వచ్చిన తర్వాత నక్సలైట్లతో కలిసి నడవాల్సిందని, కానీ పరిస్థితులు అలా జరగలేదన్నారు. ఉద్యమ సమయంలో అప్పటి ప్రభుత్వాలకు తాను అమ్ముడుపోతానని చాలా మంది అనుమానించారని, కానీ, తాను ఎన్నడూ ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయలేదన్నారు. నిజాయితీగా పోరాడానని స్పష్టం చేశారు. 'తెలంగాణను నేనే తెచ్చాను' అనే అహంకార ధోరణిలో కెసిఆర్ ఉండేవారన్నారు. కెసిఆర్ ప్రభుత్వాన్ని గద్దె దించడానికి టిజెఎస్ శక్తి ఒక్కటే సరిపోదని భావించి, అందుకే కాంగ్రెస్ పార్టీకి మద్దతు ప్రకటించామని ఆయన చెప్పారు. ప్రస్తుతం రాష్ట్రంలో స్వేచ్ఛాయుత వాతావరణం ఉందని, ప్రభుత్వానికి ఏదైనా నేరుగా చెప్పగలిగే వెసులుబాటు కలిగిందన్నారు. తమ దగ్గర పంపిణీ చేయడానికి పైసలు లేవు, అందుకే తమకు ఓట్లు రావని తెలుసు, తమకు ఓట్లు లేకపోయినా ప్రజల నమ్మకాన్ని మాత్రం సాధించామని స్పష్టం చేశారు.

**ప్రత్యామ్నాయ రాజకీయాలే లక్ష్యం :** విలువలను కాపాడే రాజకీయాలే భవిష్యత్తును కాపాడగలవనే నినాదంతో టిజెఎస్ తన 2026 రాజకీయ తీర్మానాన్ని ప్రకటించింది. ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొన్న రాజకీయ, ఆర్థిక పరిస్థితులను విశ్లేషిస్తూ, పార్టీ భవిష్యత్తు కార్యాచరణను ఈ తీర్మానం ద్వారా వెల్లడించింది. గత బిఆర్ఎస్ ప్రభుత్వ నిరంకుశత్వాన్ని అంతం చేసేందుకు 2023 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇచ్చామని, అయితే రెండు ఏళ్లు గడిచిన తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ప్రజా ఆకాంక్షలను నెరవేర్చడంలో విఫలమవుతోందని పార్టీ అభిప్రాయపడింది.

**రాజకీయ శూన్యత – విపక్షాల వైఫల్యం :** రాష్ట్రంలో బిఆర్ఎస్ పార్టీ జవసత్వాలు కోల్పోతుంటే, కాంగ్రెస్ తన తప్పుడు నిర్ణయాలతో దానికి మళ్ళీ ఊపిరి పోస్తోందని తీర్మానంలో టిజెఎస్ స్పష్టం చేసింది. మరోవైపు, తెలంగాణ అస్తిత్వాన్ని అవమానించేలా బిజెపి విద్వేష రాజకీయాలకు పాల్పడుతోందని విమర్శించింది.

**ఆర్థిక సంక్షోభం – బకాయిల పెండింగ్ :** రాష్ట్రం తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉందని, ఫీజు రియంబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ, ఉద్యోగుల రిటైర్‌మెంట్ బకాయిలు చెల్లించడంలో ప్రభుత్వం విఫలమైందని పార్టీ ఎత్తి చూపింది. నిరుద్యోగుల కోసం ఉద్యోగ క్యాలెండర్ విడుదల చేయడంలో కూడా జాప్యం జరుగుతోందని తీర్మానించింది.

**భవిష్యత్తు కార్యాచరణ :** తెలంగాణ అస్తిత్వాన్ని కాపాడే బాధ్యత తమపైనే ఉందని భావిస్తూ, టిజెఎస్ కింది స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలని నిర్ణయించుకుంది. సింగరేణి ప్రైవేటీకరణను అడ్డుకోవడం, ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేయడం కోసం పోరాడటం. బిసి రిజర్వేషన్‌ల పెంపు, చట్టసభల్లో మహిళా రిజర్వేషన్‌లలో ఓబిసి కోటా కోసం ఒత్తిడి తేవడం. గ్రామ స్థాయి నుండి పార్టీ నిర్మాణాన్ని పటిష్ఠం చేస్తూ, ప్రజాస్వామిక తెలంగాణ నిర్మాణం కోసం పనిచేయడం. ఆశ్రిత పెట్టుబడి వ్యవస్థ (క్రోనీ క్యాపిటలిజం) నుండి రాజకీయాలను విముక్తి చేసి, ప్రజల కేంద్రంగా అభివృద్ధి నమూనాను రూపొందించడమే తమ లక్ష్యం అని తెలంగాణ జన సమితి తీన తీర్మానంలో స్పష్టం చేసింది.





# ఆదాయ వనరుల పెంపుపై స్థానిక సంస్థలు దృష్టి

### రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్య

**ప్రజాపక్షం/రంగారెడ్డి :** ఆదాయ వనరుల పెంపుపై స్థానిక సంస్థలు దృష్టి సారించాలని రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్య అన్నారు. దక్షిణ తెలంగాణా జిల్లాల స్థానిక సంస్థల ప్రాంతీయ సదస్సులో పాల్గొనడానికి మంగళవారం రంగారెడ్డి సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం భవనానికి చేరుకున్న రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్యకు, సభ్యులకు రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి కొప్పిశెట్టి పుష్పగుచ్ఛం అందించి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం రంగారెడ్డి సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం కాన్ఫరెన్స్ హాల్ లో దక్షిణ తెలంగాణా స్థానిక సంస్థల ప్రాంతీయ సదస్సు నిర్వహించారు. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, అధికారులతో రాష్ట్ర ఆర్థిక సంఘం సభ్య కార్యదర్శి కాత్యాయని,సభ్యుడు ఎస్.సుధీర్ రెడ్డిలతో కలిసి చైర్మన్ సిరిసిల్ల రాజయ్య సమీక్ష నిర్వహించారు. రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్మయి,దక్షిణ తెలంగాణా జిల్లాల నుండి విచ్చేసిన అదనపు కలెక్టర్లు తమ తమ జిల్లాలలో స్థానిక సంస్థల పని తీరు గురించి చైర్మన్ కు వివరించారు.నగర పాలక సంస్థలు,మున్సిపల్ పట్టణాలు,గ్రామ పంచాయతీలలో పారిశుధ్యం, తాగునీటి సరఫరా,వీధి దీపాలు, తడి, పొడి చెత్త సేకరణ, పచ్చదనం పెంపు, పన్ను వసూళ్లు,స్వయం ఉపాధి పథకాల అమలు, ప్రజల జీవన ప్రమాణాల పెంపు కోసం కొనసాగుతున్న కార్యక్రమాలు, గ్రాంట్స్ రూపంలో సమకూరుతున్న ఆదాయం,ఇతర మార్గాల ద్వారా స్థానిక సంస్థలకు అందుతున్న రాబడి తదితర అంశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా రాజయ్య మాట్లాడుతూ స్థానికంగా అందుబాటులో ఉన్న అన్ని అవకాశాలను వినియోగించుకుంటూ, ఆదాయ వనరులను పెంపొందించుకునే దిశగా స్థానిక సంస్థలు చిత్తశుద్ధితో కృషి చేయాలని సూచించారు. అనవసర వ్యయాన్ని తగ్గించుకుని, ఆదాయ వనరుల ద్వారా రాబడిని పెంచుకున్నప్పుడే స్థానిక సంస్థల ద్వారా ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తూ,వారి జీవన ప్రమాణాలను మెరుగుపర్చేందుకు అవకాశం ఉంటుందని అన్నారు. అన్ని గ్రామ పంచాయతీలు, మున్సిపల్ వార్డులలో ప్రతి నివాస గృహానికి రక్షిత మంచినీరు సరఫరా జరిగేలా,పారిశుధ్య నిర్వహణ పక్కాగా కొనసాగేలా స్థానిక సంస్థలు నిశిత పర్యవేక్షణ చేయాలన్నారు. ఇటీవలే కొత్తగా ఎన్నికైన గ్రామ పంచాయతీల సర్పంచ్ లు, మేయర్లు, చైర్ పర్సన్లు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు ప్రజలకు మౌలిక సదుపాయాలను మెరుగుపర్చడం, స్థానిక సంస్థల బలోపేతంపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని సూచించారు. నిధుల కోసం పూర్తిగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పైనే ఆధారపడకుండా స్థానికంగా ఆదాయం సమకూర్చే అన్ని వనరులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పన్ను వసూళ్లు, ప్రకటనలపై వచ్చే రాబడి,వృత్తి పన్ను, వ్యాపార వాణిజ్య సముదాయాలు, ఇతర నిర్మాణాలకు సంబంధించి నిర్ణీత రుసుము వసూలు చేస్తూ స్థానిక సంస్థలు ఆర్థిక పరిపుష్టి సాధించేలా కృషి చేయాలని అన్నారు. స్థానిక సంస్థలలో ఆదాయం వనరులు పెంపొందించుకునేందుకు గల అవకాశాలపై ప్రజాప్రతినిధులు,అధికారుల నుండి సలహాలు స్వీకరించారు. వీటిని క్రోడీకరించి ప్రభుత్వానికి నివేదిస్తామని చైర్మన్ సిరిసిల్ల రాజయ్య వెల్లడించారు. ఈ సదస్సులో రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు)డాక్టర్ కిరణ్మయి కొప్పిశెట్టి ,దక్షిణ జిల్లాల అదనపు కలెక్టర్లు మధుసూదన్ నాయక్,జి.ఫణీంద్ర రెడ్డి,రంగారెడ్డి జిల్లా జెడ్‌పి సిఇఒ కృష్ణారెడ్డి,జిల్లా పంచాయతీ అధికారి వి సురేష్ మోహన్,మున్సిపల్ చైర్ పర్సన్లు, కమిషనర్ లు, డిపిఒలు, ఎంపిడిఒలు, ఎంపిఒలు సర్పంచులు, పంచాయతీ సెక్రటరీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



# మంత్రి కోమటిరెడ్డిని కలిసిన డిజిపి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డిని మంగళవారం హైదరాబాద్ లోని వారి నివాసంలో రాష్ట్ర డిజిపి సివి ఆనంద్ మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్ర నూతన డిజిపిగా ఇటీవల నియామకమైన సివి ఆనంద్ కు మంత్రి శుభాకాంక్షలు తెలిపి అభినందించారు. వివిధ హోదాల్లో పోలీస్ శాఖలో ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చిన మంచి పోలీస్ అధికారిగా పేరుగాంచారని, డిజిపి గా ప్రస్తుతం చేపట్టిన నూతన బాధ్యతలను ఆదర్శవంతంగా నిర్వహించాలని మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి కాంక్షించారు.

# ప్రభుత్వ వైఫల్యాలు ఎండగడుతూ ప్రజల్లో ఉండాలి

### ఎర్రవల్లిలో ముఖ్యనేతలతో బిఆర్ఎస్ చీఫ్ కెసిఆర్ భేటీ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ నిరంతరం ప్రజల్లో ఉండాలని భారత్ రాష్ట్ర సమితి (బిఆర్ఎస్) అధ్యక్షుడు కె. చంద్రశేఖర్ రావు అన్నారు. పార్టీ పిలుపునిచ్చిన కార్యక్రమాల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించే నాయకులకు ఈసారి టికెట్లు ఉండవని కఠినంగా హెచ్చరించినట్లు తెలిసింది. ఎర్రవల్లి ఫామ్ హౌస్‌లో కెసిఆర్ అధ్యక్షతన పార్టీ ముఖ్య నేతల సమావేశం సుదీర్ఘంగా కొనసాగింది. దాదాపు ఐదు గంటల పాటు జరిగిన ఈ భేటీలో పార్టీ పునర్నిర్మాణం, సంస్థాగత మార్పులపై కెసిఆర్ కీలక దిశానిర్దేశం చేశారు. పార్టీని క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేసే దిశగా పలు సూచనలు చేశారు. ప్రస్తుతం ఉన్న గ్రామ, మండల, జిల్లా స్థాయి కమిటీలను రద్దు చేసి, వాటి స్థానంలో కొత్త కమిటీలను నియమించాలని కెసిఆర్ ఆదేశించారు.

కొత్తగా వేయబోయే కమిటీల్లో పార్టీ కోసం కష్టపడి పనిచేసే యువతకు పెద్దపీట వేయాలని నిర్ణయించారు. పార్టీ సభ్యత్వ నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని, ఇన్‌చార్జ్‌ల నియామకంపై దృష్టి సారించాలని నాయకులకు సూచించారు. రానున్న ఎంపిటిసి, జెడ్‌పిటిసి, జిహెచ్‌ఎంసి ఎన్నికల కోసం ఇప్పటి నుంచే సమాయత్తం కావాలని కెసిఆర్ స్పష్టం చేశారు. ప్రజలు, ముఖ్యంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వంపై గట్టిగా పోరాడాలని నేతలను ఆదేశించారు. ప్రధాని నరేంద్ర మోదీ ఇటీవల చేసిన తెలంగాణ పర్యటన, దాని ప్రభావంపై కెసిఆర్ ఆరా తీశారు.

బండి సంజయ్ కుమారుడి కేసు వ్యవహారంపై కూడా ఈ భేటీలో చర్చ జరిగింది. ఈ అంశానికి సంబంధించిన వివరాలను బిఆర్ఎస్ నేత ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ కెసిఆర్ వివరించారు. ఈ సమావేశంలో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి.రామారావు, బిఆర్ఎస్ఎల్‌పి నాయకులు హరీశ్ రావు, సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, శాసన మండలి ఫ్లోర్ లీడర్ మధుసూదనాచారి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్లు ఎల్. రమణ, పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, ఇతర ప్రధాన కార్యదర్శులు హాజరయ్యారు.

# అక్రమ నిర్బంధం ఆరోపణలపై కేసుల కొట్టివేతకు హైకోర్టు నిరాకరణ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** అక్రమ నిర్బంధం ఆరోపణలపై కేసులను కొట్టివేతకు హైకోర్టు నిరాకరించింది. ఆరోపణలు తీవ్రమైన స్వభావం కలిగినవని, వీటిపై కింది కోర్టులో విచారణ జరగాల్సిందేనని స్పష్టం చేసింది. సామాజిక మాధ్యమాల్లో పోస్టుల వ్యవహారంలో కేసు నమోదు పేరుతో అక్రమంగా నిర్బంధించి అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని లాయర్ విజయ్‌గోపాల్ ఇచ్చిన ప్రైవేటు ఫిర్యాదు ఆధారంగా కింది కేసు ఉత్తర్వులకు అనుగుణంగా పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసుల నమోదుకు ప్రభుత్వ అనుమతి లేదు కాబట్టి కొట్టివేయాలంటూ పోలీసు అధికారులు ఇద్దరు దాఖలు చేసిన పిటిషన్లను కొట్టివేసింది. రూపవత్ పవన్, ఎన్.శంకర్ వేర్వేరుగా దాఖలు చేసిన పిటిషన్లను జస్టిస్ తుకారాంజీ కొట్టివేశారు. సీఆర్‌పీసీ 41ఎ కింద నోటీసులు జారీ చేసిన తర్వాతే విచారణ జరిపామని, కేసులను కొట్టివేయాలని ఇద్దరు పోలీసుల తరపు లాయర్ వాదించారు. అక్రమ నిర్బంధానికి సంబంధించిన ఆరోపణలకు ఎలాంటి ఆధారాలు లేవన్నారు. దీనికి ప్రతివాదుల తరపు న్యాయవాది అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఎఫ్ఐఆర్ నమోదు చేయకముందే కొన్ని గంటలపాటు అక్రమంగా నిర్బంధించారని కోర్టుకు వివరించారు. ఇరుపక్షాల వాదనల అనంతరం హైకోర్టు, పోలీసులపై కేసుల విచారణ దశలో ఉండగా వాటిని కొట్టివేయబోమని తీర్పు చెప్పింది.

# తప్పు చేసినట్లు తేలితే శిక్ష అనుభవించాల్సిందే



కోర్టు నిర్ణయమే నాకు శిరోధార్యం
కరీంనగర్ ''హిందూ ఏక్తా యాత్ర''లో
కేంద్ర మంత్రి బండి సంజయ్

**ప్రజాపక్షం/కరీంనగర్ :** ''ఏ తప్పు చేయలేదని నా కొడుకు చెబుతున్నాడు. నిజానిజాలు కోర్టులు తేలుస్తాయి. తప్పు చేసినట్లు తేలితే శిక్ష అనుభవించాల్సిందే. చట్టం ముందు అందరూ సమానమే. కోర్టు నిర్ణయమే నాకు శిరోధార్యం. చట్టానికి కట్టుబడి ఉన్నా'' అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. ''సమాజమే నా కుటుంబమని భావించి జీవితమంతా సమాజం కోసమే పనిచేసిన. ఏ ఇంట్లో కష్టమొచ్చినా పెద్ద కొడుకునై అండగా ఉన్నా. కానీ కొడుకుకు టైమివ్వలేకపోయా. జరుగుతున్న పరిణామాలకు తప్పు నాదే. క్షమించండి'' అని తెలంగాణ సమాజానికి విజ్ఞప్తి చేశారు. జీవితాంతం నా బాటలోనే నడిచిన నా భార్య కార్యకర్తలకు ఏ కష్టమొచ్చినా చేతనైనంత సాయం చేసిందని, ఈరోజు కన్న పేగునే క్షోభకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అయినా తాను భయపడేది లేదని స్పష్టం చేసిన బండి సంజయ్ ''నన్ను కెలికారు. నా కుటుంబానికి నిప్పంటించారు. ఆ నిప్పుతోనే అవినీతి, కుట్రలు చేసే వాళ్ల సామ్రాజ్యాన్ని దహించి వేస్తా. అవినీతి గడీలను బద్దలు కొడతా''అని అన్నారు. హనుమాన్ జయంతిని పురస్కరించుకుని కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆధ్వర్యంలో మంగళవారంసాయంత్రం కరీంనగర్ లోని వైశ్యాభవన్ నుండి ''హిందూ ఏక్తా యాత్ర'' ప్రారంభమైంది. హంపి పీఠాధిపతి విద్యారణ్య భారతి ఏక్తా యాత్రకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వేలాది మంది ఈ యాత్రకు తరలివచ్చారు. ఈ సందర్భంగా వారిని ఉద్దేశించి బండి సంజయ్ ఉద్వేగ భరిత ప్రసంగం చేశారు. సమాజమే నా ఇల్లు అనుకున్న. హార్ట్ లో స్టంట్ ఉన్నా హార్ట్ ఫుల్ గా 1600 కి.మీలు నడిచిన. తెలంగాణ ప్రజల కష్టాలను పంచుకున్నానని, నాటి పాలకులు నాపై రాళ్ల దాడి చేసినా, 109 కేసులు పెట్టి జైలుకు పంపినా భయపడలేదన్నారు. నా కొడుకును క్రిమినల్‌గా చూపే ప్రయత్నం చేస్తున్నారని, అయినా నా కొడుకును నేను సమర్థించడం లేదని, చట్టాన్ని, న్యాయాన్ని గౌరవిస్తానని, కోర్టు నిర్ణయాన్ని శిరసావహిస్తానని, చట్ట ప్రకారం చర్యలు తీసుకోవచ్చన్నారు.



# ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టు డంప్

### కోటి రూపాయలు నగదు,ఆయుధాలు స్వాధీనం

**నారాయణ్‌పూర్:** ఛత్తీస్‌గఢ్‌లో భద్రతా దళాలు మావోయిస్టు డంప్‌ను స్వాధీనం చేసుకున్నాయి. ఈ డంప్ నుండి కోటి రూపాయలు నగదు, ఆయుధాలు,ఆయుధ సామాగ్రిని వెలికితీశారు. పేలుడు పదార్థాలను కూడా స్వాధీనం చేసుకున్నారు. నక్సల్ వ్యతిరేక కార్యకలాపాలు నిర్వహించే ప్రత్యేక దళాలు నారాయణ్‌పూర్‌జిల్లాలోని అటవీ ప్రాంతంలో భారీ ఎత్తున గాలించి ఈ డంప్ స్వాధీనం చేసుకున్నాయి. ఈ ఏడాది మార్చి 31వ తేదీన ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాన్ని కేంద్ర ప్రభుత్వం మావోయిస్టుల నిర్మూలనా రాష్ట్రంగా ప్రకటించింది. లొంగిపోయిన మావోయిస్టు కార్యకర్తలు,నాయకులు ఇచ్చిన సమాచారం మేరకు మావోయిస్టుల డంప్‌లను, మందుపాతరలను ప్రత్యేక దళాలు కనిపెట్టి వెలికితీస్తున్నాయి. ఛత్తీస్‌గఢ్ జిల్లా పోలీసులు, జిల్లా రిజర్వు గార్డు, ఇండో–టిబిటెన్ సరిహద్దు పోలీసు,సరిహద్దు భద్రతా దళాలు ''మాద్ బచావో అభియాన్' కింద ఈ గాలింపు కార్యక్రమాల్లో భాగస్వాములుగా ఉన్నట్లు జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ రోబిన్‌సన్ గురియా మంగళవారం మీడియాకు చెప్పారు. ప్రధానంగా అభుజామద్ అడవుల్లో ఈ గాలింపు చేస్తున్నట్లు చెప్పారు. ఈసారి ప్రధానంగా గూఢచారి వర్గాల సమాచారం మేరకు, గ్రామస్థుల క్రియాశీల మద్దతుతో భద్రతా దళాలు మారుమూల అటవీ ప్రాంతాలలో ఈ డంప్‌లను వెలికి తీస్తునట్లు చెప్పారు. ఈ ఆపరేషన్ సందర్భంగా రూ.1.01 కోట్లు నగదు స్వాధీనం చేసుకున్నామని, కేవలం ఒక్క డంప్ నుండే రూ.14 లక్షలు స్వాధీనం చేసుకున్నామని, దీంతోపాటు 28 ఆయుధాలు, తూటాలు,పేలుడు పదార్థాలు,రోజువారీ ఉపయోగించుకునే వస్తువులు, ఎకె–47 రైఫిళ్ళు, ఎస్ఎల్ఆర్ రైఫిళ్ళు, 303 రైఫిళ్ళు, 315 బోర్ రైఫిల్,రెండు 12 బోర్ గన్స్, రెండు నాటు తుపాకులు,పిస్తోళ్ళు,ఒక ఎయిర్‌గన్ స్వాధీనం చేసుకున్నామని చెప్పారు.

# 3.48 శాతం పెరిగిన వినియోగదారుల ద్రవ్యోల్బణం

### తెలంగాణలో అత్యధికం, మిజోరాంలో అత్యల్పం




**న్యూఢిల్లీ:** వినియోగదారుల ద్రవ్యోల్బణం ఏప్రిల్ నెలలో 3.48 శాతం మేరకు పెరిగింది. ప్రధానంగా బంగారం,వెండి ఆభరణాల ధరలు బాగా పెరిగిపోవడంవల్ల, కొన్ని వంటింటి వస్తువుల ధరలు కూడా పెరగడంవల్ల వినియోగదారుల ద్రవ్యోల్బణం పెరిగిందని ప్రభుత్వ గణాంకాలు మంగళవారం వెల్లడించాయి. 2024 సంవత్సరం ఆధారంగా వినియోగదారుల ధరల సూచీ (సిపిఐ) ద్రవ్యోల్బణం చూసినప్పుడు మార్చి నెలలో 3.40 శాతం, ఫిబ్రవరిలో 3.21 శాతం, జనవరి నెలలో 2.74 శాతంగా నమోదైనట్లు జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్ఎస్ఓ) ప్రకటించింది. రిజర్వు బ్యాంకు తన రెండు మాసాల ద్రవ్య విధానంలో తెలంగాణలో అత్యధికంగా 5.81 శాతం మేరకు మిజోరాంలో దేశంలోనే అత్యంత తక్కువగా 0.69 శాతం మేరకు చూపించింది. ఆహార వస్తువుల ధరలు ఏప్రిల్ నెలలో 4.20 శాతం మేరకు పెరిగాయి. ఇదే ఆహార వస్తువుల ధరలు మార్చి నెలలో 3.87 శాతంగా మాత్రమే ఉండేవి. అదేవిధంగా వెండి ఆభరణాల ధరలు కూడా భారీ ఎత్తున 144.34 శాతం మేరకు పెరిగాయి. గానుగ నూనె తీసే కొబ్బరి చిప్పల ద్రవ్యోల్బణం కూడా 44.55 శాతం, బంగారం, వజ్రాలు,ప్లాటినం ఆభరణాల ధరలు 40.72శాతం మేరకు, టొమాటో ధర 35.28 శాతం, కాలిఫ్లవర్ ద్రవ్యోల్బణం 25.58 శాతం మేరకు పెరిగాయి. మరోవైపు పొటాటో, ఉల్లిపాయలు, మోటారు వాహనాలు,జీపు,బఠాణీలు, ఎయిర్ కండిషనర్లు ధరలు తగ్గుదల ధోరణిలో కొనసాగాయి. గతనెలలో రిజర్వు బ్యాంకు వినియోగ దారుల ధరల సూచీ ద్రవ్యోల్బణాన్ని 2026–27 సంవత్సరంలో మొదటి త్రైమాసికంలో 4.6 శాతంగా అంచనావేసింది. ఇంధన ధరలు కూడా పశ్చిమాసియాలో యుద్ధం వల్ల, ఎల్‌నినో పరిస్థితుల అవకాశాలవల్ల భారీగా పెరిగే ధోరణిలో కొనసాగుతాయని, ఇవి సమస్యాత్మకంగా మారతాయని అంచనావేసింది. గ్రామీణ,పట్టణ ప్రాంతాలలో వినియోగ దారుల ధరల సూచీ ద్రవ్యోల్బణంఅన్ని ఎన్ఎస్ఓ వరుసగా 3.74 శాతం 3.16 శాతంగా చూపించింది.

### భారతదేశానికి రెండు నెలలకు సరిపడా...

# ఇంధన నిల్వలు ఉన్నాయ్




### చమురు శాఖ మంత్రి హర్దీప్‌సింగ్ పూరి

### ఆయిల్ కంపెనీలు రోజుకు రూ.1,000 కోట్ల నష్టాలు చవిచూస్తున్నాయని మంత్రి వెల్లడి

**న్యూఢిల్లీ :** ప్రపంచ ఇంధన ప్రవాహాలకు అంతరాయాలు ఏర్పడినప్పటికీ రెండు నెలలకు సరిపడా ఇంధన నిల్వలు ఉన్నందున భారతదేశానికి ఎలాంటి సరఫరా సమస్యలు లేవని చమురు శాఖ మంత్రి హర్దీప్‌సింగ్ పూరి స్పష్టం చేశారు. ఆయన మంగళవారం ఇక్కడ జరిగిన భారత పరిశ్రమల సమాఖ్య (సిఐఐ) వార్షిక సదస్సులో ఈ విషయాన్ని వెల్లడించారు. అయితే ముడి చమురు ధరలు అధికంగా కొనసాగి చిల్లర ఇంధన ధరలు యథాతథంగా ఉంటే ప్రభుత్వ రంగ ఇంధన చిల్లర వ్యాపారులు ఒకే త్రైమాసికంలో రూ.1లక్ష కోట్ల నష్టాలను చవిచూడాల్సి వస్తుందని మంత్రి హర్దీప్‌సింగ్ పూరి హెచ్చరించారు. పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ఎల్‌పిజిని ఉత్పత్తి వ్యయం కంటే తక్కువ ధరలకు అమ్మడం వల్ల రిటైలర్లు ఎంతకాలం నష్టాలను భరించగలరనే దానిపై ఏదో ఒక దశలో అంచనా వేయవలసి ఉంటుందని ఆయన తెలియజేశారు. కానీ త్వరలోనే ధరలు పెంచుతారా? అనే దానిపై ఊహాగానాలు చేయడానికి ఆయన నిరాకరించారు. 'మాకు సరఫరా పరంగా ఎలాంటి సమస్యలు లేవు' అని మంత్రి ఇక్కడ జరిగిన సిఐఐ బిజినెస్ సమ్మిట్‌లో స్పష్టీకరించారు. సంక్షోభం ప్రారంభమయ్యే నాటికి భారతదేశం వద్ద 'సరిపడా కంటే ఎక్కువ' ముడిచమురు, ఎల్‌పిజి నిల్వలు ఉన్నాయని, నాటి నుంచి దేశీయ ఎల్‌పిజి ఉత్పత్తిని గతంలోని రోజుకు సుమారు 36,000టన్నుల నుంచి 54,000 టన్నులకు పెంచిందని, అదే సమయంలో రిటైల్ ఇంధన ధరలను యథాతథంగా ఉంచడం వల్ల పెరుగుతున్న ఆర్థిక వత్తిడి విషయాన్ని మంత్రి హర్దీప్‌సింగ్ అంగీకరించారు. 'మా ఆయిల్ కంపెనీలు ఒక రోజుకు రూ.1,000 కోట్లు నష్టపోతున్నాయి' అని మంత్రి వెల్లడించారు. అంతేకాకుండా సంచిత వసూళ్లలో నష్టాలు దాదాపు 1.98లక్షల కోట్లకు పెరిగిందని, ఒక్క త్రైమాసికంలో రూ.1లక్ష కోట్ల నష్టాలు వస్తే ఈ రంగం వార్షిక లాభాలు తుడిచిపెట్టుకుపోతాయని ఆయన చెప్పారు. 10వారాల క్రితం పశ్చిమాసియాలో యుద్ధం ప్రారంభమైనప్పటి నుండి రేషనింగ్ విధించిన లేదా అధిక ధరల పెంపును వినియోగదారులకు బదిలీ చేసిన అనేక ప్రపంచ ఇంధన వ్యవస్థలకు భిన్నంగా ప్రభుత్వ యాజమాన్యంలోని ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు (ఒఎంసిలు) ఖర్చు కంటే చాలా తక్కువ ధరలకే పెట్రోల్, డీజిల్, ఎల్‌పిజి వంట గ్యాస్ ఎల్‌పిజి సరఫరాలను నిరంతరాయంగా అందిస్తున్నాయి. దీని ఫలితంగా మూడు చమురు మార్కెటింగ్ కంపెనీలు –ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఒసి), భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బిపిసిఎల్), హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పిసిఎల్) రికార్డు స్థాయిలో అండర్ రికవరీలను (బెంచ్‌మార్క్ అంతర్జాతీయ వ్యయం, రిటైల్ అమ్మకం ధర వ్యత్యాసం) ఎదుర్కొంటున్నాయి. ప్రస్తుత త్రైమాసికంలో పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ఎల్‌పిజిపై కలిపి దాదాపు 1. 98లక్షల కోట్ల లోటు ఉండగా , వాస్తవ నష్టం సుమారు రూ.1లక్ష కోట్లుగా ఉందని మంత్రి హర్దీప్‌సింగ్ పూరి తెలియజేశారు. ఒక త్రైమాసికంలో వచ్చే నష్టాలు, చమురు కంపెనీలు ఏడాది మొత్తం సంపాదించే లాభాన్ని తుడిచిపెట్టడానికి సరిపోతాయని ఆయన చెప్పారు. పెరుగుతున్న నష్టాల వల్ల త్వరలో ధరలు పెరిగే అవకాశం ఉందో లేదో చెప్పకుండా ఆయన ఇలా అన్నారు. 'చమురు కంపెనీలు ఈ నష్టాలను ఇంకెంతకాలం భరించగలవు. నిజం చెప్పాలంటే అదే నన్ను ఆందోళనకు గురిచేస్తోంది. గత నాలుగేళ్లుగా పెట్రోల్, డీజిల్ ధరలు పెరగలేదు' అని మంత్రి వివరించారు. ముడి చమురు ధరలు 50శాతం పెరిగినప్పటికీ పెట్రోల్, డీజిల్ ధరలు వరుసగా లీటర్‌కు రూ.94.77, రూ.87.67 చొప్పున రెండేళ్ల నాటి ధరల వద్దే కొనసాగుతున్నాయి. గృహ వంట గ్యాస్ ఎల్‌పిజి ధరలను మార్చిలో సిలిండర్‌కు రూ.60పెంచినప్పటికీ, అవి ఇప్పటికీ వాస్తవ ధరకంటే చాలా తక్కువగా ఉన్నాయి. చమురు కంపెనీలు ప్రస్తుతం పెట్రోల్‌పై లీటరుకు రూ.14, డీజిల్‌పై లీటర్‌కు రూ.42, వంట గ్యాస్ ఎల్‌పిజిపై రూ.674 నష్టపోతున్నాయి. ఇంధన వినియోగంలో మితంగా ఉండాలన్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపును తక్షణ ఆకాంక్షలకు సంకేతంగా కాకుండా, ఒక దార్శనిక దీర్ఘకాలిక విధానంగా హర్దీప్‌సింగ్ పూరి అభివర్ణించారు.'రేపు లాక్‌డౌన్ జరగబోదని కాదు' అని ఆయన చెప్పారు. భారతదేశం గ్యాస్ పైప్‌లైన్ మౌలిక సదుపాయాలను , ఎల్‌పిజి లభ్యతను వేగంగా విస్తరిస్తోందని పేర్కొంటూ, సాధ్యమైన చోట ఎల్‌పిజి నుంచి పైప్‌లైన్ల ద్వారా సరఫరా అయ్యే సహజవాయువుకు మారే ప్రక్రియను పరిశ్రమలు, గృహాలు వేగవంతంచేయాలని మంత్రి కోరారు. 'మాకు పైప్ గ్యాస్ కొరత లేదు' అని ఆయన చెప్పారు. దేశంలోని ప్రతీ ఒక్కరికీ పెట్రోల్, డీజిల్ అందాయని, ఎల్‌పిజి సరఫరా చాలా ఎక్కువగా ఉందని, భారతదేశం ఇంధన ధరలను పెంచలేదని హర్దీప్‌సింగ్ పూరి వివరించారు.

